క్లుప్తంగా

ఏపీపీ రాజేంద్రప్రసాద్‌కు వీడ్కోలు సత్కారం



ఏపీపీ రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న ఏపీపీలు

ఏలూరు (టూటౌన్‌): ఈ నెలాఖరుతో తన టెన్యూర్‌ను పూర్తి చేసుకుంటున్న సెకండ్‌ ఏడీజే కోర్టు ఏపీపీ సీహెచ్‌ రాజేంద్రప్రసాద్‌కు శనివారం వీడ్కోలు సత్కారం చేశారు. జాయింట్‌ డైరెక్టర్స్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్స్‌ లాం అజయ్‌, లాం సుబ్బలక్ష్మి చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. దానిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సీహెచ్‌ రాజేంద్రప్రసాద్‌తో పాటు మరొక ఏపీపీల మూడేళ్ల పదవీ కాలం జూలై నెలాఖరుతో ముగియనుండటంతో వారిని ఘనంగా సత్కరించారు. ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో డీడీపీ రామకోటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్స్‌ లక్ష్మణ్‌నాయక్‌, ఏపీపీలు డీవీ రామాంజనేయులు, ఆచంట వెంకటేశ్వరరావు, పలువురు ఏపీపీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఏలూరులో దోమల నివారణకు ఫాగింగ్‌ చేస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్‌: ఏలూరు నగరంలో దోమలను నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆదేశాలతో ప్రతి ప్రాంతంలోనూ దోమల నివారణకు ఫాగింగ్‌, ఆయిల్‌ బాల్స్‌ నీటి నిల్వల్లో వేస్తున్నామని ఏలూరు నగర హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మాలతి తెలిపారు. ఏలూరు 44వ డివిజన్‌ రెల్లీస్‌ పేట, ముస్లింపేట, డాక్టర్‌ ప్రసాద్‌ గారివీధి, గస్‌బజార్‌ మెయిన్‌ రోడ్డు తదితర ప్రాంతాల్లో మురుగునీటి కాలువల్లో, కల్వర్టుల కింద ఫాగింగ్‌ చేశారు. ఖాళీ స్థలాలు, నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌ బాల్స్‌ వేశారు. మలేరియా ఇన్‌స్పెక్టర్‌ దత్తి వేణుగోపాల్‌స్వామి, సూపర్‌వైజర్‌ దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ చంద్రశేఖర్‌, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఏలూరు టౌన్‌: పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు ఏలూరు బీడీ కాలనీ లునానీ నగర్‌లో పేకాటాడుతున్నారని సమాచారం రావడంతో స్థావరంపై ఏలూరు రూరల్‌ ఎస్సై రాజారెడ్డి తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.18,610 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

విలీన గ్రామాలకు అందని 'గోకులం'

- ఉపాధి హామీ పథకం నిధులతో గోకులం షెడ్ల నిర్మాణం
- కార్పొరేషన్‌లో కలిసిన గ్రామాలకు వర్తించని పథకం
- అర్హత కోల్పోయిన వందలాది పాడి రైతు కుటుంబాలు



తంగెళ్లమూడిలో పొదల మధ్య ప్రమాదకర స్థితిలో ఉన్న గేదెలు



వెంకటాపురంలో శిథిలమైన షెడ్డు బయట ఉన్న గేదెలు

ఏలూరు రూరల్‌ : ఉపాధి హామీ పథకం నిధులతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గోకులం పథకం ఏలూరు నగరంలో విలీన గ్రామ ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. ఈ పథకం కింద ప్రభుత్వం ఆవులు, గేదెలు, గొర్రెలు, కోళ్ల కోసం షెడ్లు ఏర్పాటు చేసుకునేందుకు రుణం మంజూరు చేస్తోంది. ఇప్పుడు ఈ పథకం ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమైన వెంకటాపురం, చొదిమెళ్ల, పోణంగి, శనివారపుపేట, తంగెళ్లమూడి, కొమడవోలు, సత్రంపాడు ప్రాంతాలకు వర్తించడం లేదు. దీంతో ఈ ప్రాంతాల్లో పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు నష్టపోతున్నాయి. ఇప్పటికే అనేక మంది పేదలు ఆరు బయట, చేలల్లో, చెరువుగట్లపై ప్రమాదకర స్థితిలో పశువులను కట్టేస్తున్నారు. విలీన గ్రామాలకు సైతం పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు.

పథకం ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల పెంపకదార్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గోకులం పథకం రూపొందించింది. ఈ పథకంలో భాగంగా అర్హత కల్గిన పేద రైతు కుటుంబాలను పశు సంవర్ధకశాఖ చెందిన పశువైద్యులు గుర్తిస్తారు. వీరి పశువుల సంఖ్యను లెక్కగట్టి పలు యూనిట్లగా విభజిస్తారు. రెండు గేదెలు లేదా ఆవులు ఉన్నవారికి రూ.1.15 లక్షలు, నాలుగు ఉన్న వారికి రూ.1.85 లక్షలు, ఆరు ఉన్నవారికి రూ.2.30 లక్షలు అందించనున్నారు. 10 శాతం లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుంది. ఇదే క్రమంలో 20 జీవాలున్న గొర్రెలు, మేకల పెంపకదార్లకు రూ.1.30 లక్షలు, 50 జీవాలున్నవారికి రూ.2.30 లక్షలు, 100 కోళ్లు ఉన్న వారికి రూ.87 వేలు, 200 ఉన్నవారికి 1.32 లక్షలు అందిస్తారు. ఈ మొత్తంలో 30 శాతం లబ్ధిదారుడు భరించాలి. మొదట లబ్ధిదారులను పశు సంవర్ధకశాఖ అధికారులు నిర్ధారిస్తారు. తర్వాత ఉపాధి హామీ పథకం అధికారులు వారికి జాబ్‌కార్డులు మంజూరు చేస్తారు. రుణం మంజూరు కాగానే లబ్ధిదారులు షెడ్డు నిర్మాణం చేపట్టాలి. దీనిపై ఉపాధి హామీ పథకం అధికారుల పరివేక్షణ ఉంటుంది. గతంలోనూ టీడీపీ ప్రభుత్వం ఈ పథకం అమలు చేసింది. దీనివల్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తప్పుడు మార్గాల్లో లబ్ధి పొందారు.

పథకం వర్తింప జేయాలి

15 ఏళ్లుగా గేదెలను మేపుతూ పాడిపైనే ఆధారపడి మా కుటుంబం జీవిస్తోందని వెంకటాపురానికి చెందిన రంగారావు అన్నారు. వెంకటాపురం కార్పొరేషన్‌లో కలిసిపోయిందని ఇప్పుడు గోకులం పథకం వర్తించదని అధికారులు అంటున్నారని ఆయన వాపోయారు. ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు అందిస్తే గేదెలకు షెడ్డు వేసుకుంటానని ఆయన కోరారు.

నగరవాసులకు వర్తించదు



సత్రంపాడు, తంగెళ్లమూడి, పోణంగి, వెంకటాపురం, కొమడవోలు, చొదిమెళ్ల, శనివారపుపేట ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైనందున ఈ ప్రాంతాల ప్రజలకు పథకం వర్తించదు. పైన పేర్కొన ప్రాంతాలు పథకం వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. కూలీల జాబ్‌కార్డులు రద్దయ్యాయి. దీనివల్ల ఈ ప్రాంతాలకు పథకం అమలు చేయలేం.

– కిషోర్‌, ఏపీఓ, ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్‌

28 నుంచి కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసనలు

ఏలూరు (టూటౌన్‌): కేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని సంయుక్త కిసాన్‌ మోర్చా జిల్లా సమావేశం డిమాండ్‌ చేసింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో సంయుక్త కిసాన్‌ మోర్చా జిల్లా సమావేశం శనివారం నిర్వహించారు. ఆగస్టు 9న కార్పొరేట్స్‌ క్విట్‌ ఇండియా డే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.పెంటయ్య, కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, కేఎస్‌ఎస్‌ మూర్తి, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కో–కన్వీనర్‌, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు సున్నా వెంకట్రావు మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. జూలై 28, 29 తేదీల్లో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు ప్రారంభిస్తామని, ఆగస్టు 9న క్విట్‌ ఇండియా డే సందర్భంగా కార్పొరేట్‌ క్విట్‌ ఇండియా నినాదంతో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్‌

ఏలూరు (టూటౌన్‌) : ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలపైన సంబంధిత అధికారులు అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్‌ తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రత్యేక జువైనల్‌ పోలీసులకు ఒక రోజు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్‌ మాట్లాడుతూ మారుతున్న చట్టాలపై అధికారులకు అవగాహన కల్పించడమే జిల్లా న్యాయసేవాధికార సంస్థ లక్ష్యమన్నారు. అదనపు సీనియర్‌ సివిల్‌ జడ్జి కేకేవీ బుల్లికృష్ణ మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సు ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ రాజ్యాంగం బాలలకు కొన్ని హక్కులు కల్పించిందన్నారు. వాటిని కాపాడటమే న్యాయస్థానాల ముఖ్య ఉద్దేశమన్నారు. అదనపు సూపరింటెండెంట్‌ ఆఫ్‌ పోలీస్‌ జి.స్వరూపరాణి మాట్లాడుతూ న్యాయస్థానాలు ఎప్పటికప్పుడు అందిస్తున్న అవగాహన సదస్సులకు అధికారులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ సీహెచ్‌ సూర్యచక్రవేణి, జిల్లా ప్రొబేషనరీ ఆఫీసర్‌ డి.దుర్గాప్రసాద్‌, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌ కుమార్‌, ప్యానల్‌ లాయర్లు టి.సుబ్బారావు, కె.వెంకటేశ్వరరావు, కె.కృష్ణారావు, పలువురు న్యాయవాదులు, పోలీసు అధికారులు, సీడబ్ల్యూసీ సిబ్బంది, ఇతర అధికారులు, పారాలీగల్‌ వలంటీర్లు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం చెల్లించాలి



వ్యవసాయశాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్‌): భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, ఖరీఫ్‌ సాగుకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేలు రైతులకు వెంటనే అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ కోరింది. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ (ఏడీఏ) శైలజకు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాలు వెంటనే నమోదు చేసి ఎకరాకు రూ.15వేలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. అన్నతదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేలు ఈ ఖరీఫ్‌ నుంచి అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. కౌలురైతులందరికీ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం పథకం వర్తింప చేయాలన్నారు. 2023లో మిచాంగ్‌ తుఫాన్‌, కరువు వల్ల పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పంటల బీమా పరిహారం అందించాలన్నారు. కౌలురైతులందరికీ భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా పంట సాగుదారు హక్కు పత్రాలు అందించి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు.

విద్యార్థులకు పోటీలు



విద్యార్థులకు నిర్వహించే పోటీల వాల్‌ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : 78వ స్వాతంత్ర దినోత్సవం, 75వ రాజ్యాంగ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 11న విద్యార్థులకు భారత రాజ్యాంగ పీఠికలోని అంశాల ఆధారంగా ఎంపిక చేసిన చిత్రాల డ్రాయింగ్‌ పోటీలు, స్వాతంత్ర పోరాటం, రాజ్యాంగానికి సంబంధించిన అంశాలపై క్లుప్త జవాబుల పోటీలు, స్వాతంత్ర సమరయోధుల వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహక కమిటీ ప్రతినిధులు ప్రకటించారు. 11వ తేదీ కార్యక్రమం ఫ్లెక్సీ, బ్రోచర్స్‌ ఆవిష్కరణ కార్యక్రమం కస్తూర్బా హైస్కూల్‌ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవీఆర్‌ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, మానవతా, భారత బచావో, హేలాపురి సింగర్స్‌ ప్రతినిధులు, కస్తూర్బా స్కూల్‌ టీచర్స్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవీఆర్‌ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లోని ఎలిమెంటరీ, హైస్కూలు, కాలేజీ విద్యార్థులకు డ్రాయింగ్‌ పోటీలు, క్లుప్త జవాబు పోటీలు, 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏలూరు కోట దిబ్బలోని కస్తూర్బా బాలికల హైస్కూల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. వేషధారణ పోటీలు, సందేశాత్మక పాటలు హేలాపురి సింగర్స్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. 50 సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భారత్‌ బచావో ఏలూరు జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. గుబ్బల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని విషయాలపై విద్యార్థులకు ఆసక్తిని పెంచడం కోసం ఆగస్టు 11న రాజ్యాంగం సంబంధించిన విషయాలపై 100 క్లుప్త జవాబు ముందుగానే స్కూళ్లు, కాలేజీలకు పంపుతామన్నారు. అందులో 25 ఎంపిక చేసిన ప్రశ్నలు హైస్కూలు, కాలేజీ విద్యార్థులకు వేర్వేరుగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణ పోటీలు రామకోటి వేదికలో నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు అందరికీ ప్రశంసా పత్రాలు 11వ తేదీన 4 గంటలకు రామకోటి వేదిక వద్ద సభలో కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ కేఎస్‌ లక్ష్మణరావు, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్‌ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు, డీఈవో ఎస్‌. అబ్రహం చేతులమీదుగా అందజేస్తామని తెలిపారు. ప్రతి అంశంలోనూ, ప్రతి క్యాటగిరిలోను ఎంపిక చేసిన ఐదుగురు చొప్పున బహుమతులు 15వ తేదీ సాయంత్రం ఏర్పాటు చేసిన సభలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హేలాపూరి బాలోత్సవం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, మానవత ఏలూరు కన్వీనర్‌ మేతర అజయ్‌ బాబు, ఏవీఆర్‌ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎస్‌. కస్తూరిరావు, కే శ్రీనివాసరావు, కే. శ్రావణి కుమారి, కే.జగజ్జనని, కస్తూరిబా బాలిక పాఠశాల హెడ్మాస్టర్‌ జీ. సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటర్లకు గౌరవం, భద్రత కరువు



మాట్లాడుతున్న ఆలిండియా డిస్ట్రిబ్యూటర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సీహెచ్‌ కృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బహుళ జాతి సంస్థల ఒంటెద్దు పోకడల కారణంగా దేశ వ్యాప్తంగా ఆయా ఉత్పత్తుల డిస్ట్రిబ్యూటర్లకు గౌరవ మర్యాదలు, భద్రత కరువవుతోందని ఫెడరేషన్‌ ఆఫ్‌ ఆలిండియా డిస్ట్రిబ్యూటర్స్‌ అసోసియేషన్‌ జాతీయ అధ్యక్షుడు సీహెచ్‌ కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మర్చంట్స్‌ ఛాంబర్‌ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో నిర్మాణాత్మకంగా వ్యాపారాలు సాగడం లేదని, చిన్న వ్యాపారులకు భవిష్యత్తు లేకుండా పోతోందన్నారు. వ్యాపారుల మధ్య సంతృప్తికరమైన వాతావరణం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్‌లో డిస్ట్రిబ్యూటర్లు, కిరాణా వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చట్టాలు చేయాలని ప్రభుత్వాలను కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు మద్దాలి సీఎస్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ అసోసియేషన్‌ ఏర్పడి 30 ఏళ్లు గడిచిన సందర్భంగా ఏలూరులో ఈ నెల 28న రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. ఆదివారం నిర్వహించే సమావేశంలో దీనిపై తమ భవిష్యత్‌ కార్యాచరణ రూపొందిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌. సత్యనారాయణ అన్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎంటీవీ సత్యకుమార్‌ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో డిస్ట్రిబ్యూషన్‌ వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. మాల్స్‌ కారణంగానే గ్రామీణ ప్రాంతాల్లో కిరాణా దుకాణాలు భూస్థాపితమైపోతున్నాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు సైతం బహుళజాతి సంస్థలకే అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అసోసియేషన్‌ జిల్లా ఏలూరు నగర శాఖల ప్రతినిధులు తలుపుల మురళీ కృష్ణ, మద్దుల ప్రకాష్‌, సీహెచ్‌ రవికృష్ణ, బాలిబోయిన శ్రీహరి, పల్లెల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ (ఇంద్ర)	21.00	రద్దు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.00	20
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ (స్టార్‌ లైనర్‌ నాన్‌ఏసీ స్లీపర్‌)	22.30	16
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్‌ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్‌ నంబర్‌	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌	21.45	4820	15
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌	21.15	4822	16
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం	19.45	4798	14
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు – ఈసీఐఎల్‌	22.30	4814	11
ఏలూరు – తిరుపతి	16.00	4830	28

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	74
వంకాయలు (కాంతులు)	48	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	00	ములక్కాడలు	07,10
బెండకాయలు	38	కంద	68
పచ్చిమిర్చి	50–54	బీట్‌రూట్‌	36
కాకర కాయలు	40–52	కీరా దోస	46
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్‌	80
బీరకాయలు (పందిరి)	48	అల్లం	100–160
క్యాబేజీ	34	కొత్తిమీర (కట్ట)	15–18
క్యారెట్‌	34–58	పాలకూర	12–15
దొండకాయలు	36	చుక్కకూర	12–15
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
అనబకాయ (1)	15–20	క్యాప్సికమ్‌	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

సీతారాములకు ప్రత్యేక అలంకరణ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆషాఢ సప్తమి పర్వదినం సందర్భంగా స్థానిక రామకోటి ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలోని సీతారాములను శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణ, రామ భజనలు నిర్వహించారు. అనంతరం నగరానికి చెందిన కొట్టు మధు, తదితర భక్తుల సహకారంతో శ్రీరామునికి, సీతమ్మకు, లక్ష్మణునికి, హనుమంతునికి విశేషంగా సుమారు 100 రకాల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో ప్రత్యేకంగా శాకాలంకరణ చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదం శెట్టి రమేష్‌, కొట్టు మనోజ్‌ పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ కళ్యాణ మహోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : సనాతన భాగవత భక్తసమాజం ఆధ్వర్యంలో 389వ కార్యక్రమంగా నిర్వహిస్తున్న దేవతా కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక రామకృష్ణాపురం సత్యసాయి సేవా కేంద్రంలో సీతారామ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొరెడ్ల సూర్యనారాయణ, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కే. శశిశేఖర్‌ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాల్గొనాలన్నారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకూ వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పైడేటి రామారావు. సోడిశెట్టి శాంత కుమార్‌, వై. వెంకటేశ్వరరావు, కే. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రానికి బాలుడు



బాలుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న రైల్వే ఎస్సై సైమన్‌

ఏలూరు టౌన్‌ : ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఒక బాలుడు ఒంటరిగా ప్లాట్‌ ఫామ్‌పై తిరుగుతూ ఉండగా ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్‌ గుర్తించారు. బాలుడిని వివరాలను ఆరా తీయగా తాను నాందేడ్‌ ప్రాంతం నుంచి వచ్చి ద్వారకాతిరుమల వేద పాఠశాలలో వేద విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపాడు. తన పేరు పతకీ మయూర్‌ గజానంద్‌గా తెలిపిన బాలుడు తనకు వేద పాఠశాలలో ఉండేందుకు ఇష్టం లేక పారిపోయి వచ్చానని తెలిపాడు. రైల్వే ఎస్సై సైమన్‌ బాలుడ్ని సముదాయించి, వివరాలన్నీ తెలుసుకుని వేద పాఠశాల యాజమాన్యానికి, బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అదేవిధంగా ఏలూరు జిల్లా చైల్డ్‌లైన్‌ అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు సమక్షంలో బాలుడు సురక్షితంగా ఉండేందుకు సంరక్షణ కేంద్రానికి అప్పగించామని రైల్వే ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలోని వివిధ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా పరిపాలనాధికారికి యూటీఎఫ్‌ నాయకులు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్‌ రుద్రాక్షి మాట్లాడుతూ యూటీఎఫ్‌ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 30వ తేదీ వరకూ తమ యూటీఎఫ్‌ నాయకులు, మండల, డివిజన్‌ స్థాయి అధికారులకు ప్రాతినిధ్యాలు చేయనున్నట్లు తెలిపారు. యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు ముస్తఫా అలీ, రాష్ట్ర కార్యదర్శి బీ. సుభాషిని, జిల్లా కోశాధికారి జీవీ రంగమోహన్‌, జిల్లా కోశాధికారి బీ. మోహన్‌ రావు, జిల్లాలోని వివిధమండలాల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మొక్కలు నాటిన విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఎస్‌ఈపీ)–2020 నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష రాష్ట్ర అధికారులు విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ఏలూరు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్‌ కార్యక్రమాలు ఏలూరు మండల విద్యాశాఖాధికారులు రూపావతు రంగయ్య, రవి ప్రకాష్‌ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్నాయి.శనివారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పాఠశాలల్లో తమ తల్లులతో కలిసి పిల్లలు మొక్కలు నాటారు.